www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 8 మే 2023
5
కాకినాడ



కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా నోరి బలరామకృష్ణ విద్యార్థులకు చెణుకులు, చమత్కార సంభాషణతో నవ్వులు విరబూయించారు. జన విజ్ఞాన వేదిక కాకినాడ జిల్లా శాఖ, బాలమందిరం ఆధ్వర్యంలో మాధవపట్నం జమునా నగర్‌లో ఆదివారం సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా నెంబర్ వన్ విద్యార్థి కావడం ఎలా అనే అంశంపై బలరామకృష్ణ విలువైన సూచనలు అందజేశారు. భాషానైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, న్యూస్ రీడింగ్, యాంకరింగ్ అంశాలపై అవగాహన తరగతులు నిర్వహించారు. బాలమందిరం కన్వీనర్ గోపాలకృష్ణ అధ్యక్షతన కళామందిరంలో ఆదివారం వేసవి వినోద కార్యక్రమాలు చేపట్టారు. బాల మందిరం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వెంటాడుతున్న వర్షం భయం

- అల్పపీడనంతో రైతుల ఆందోళన
- ఎక్కడికక్కడ ధాన్యం రాశులు
- వేగంగా కొనాలని వేడుకోలు



కాకినాడ రూరల్ పండూరులో ధాన్యం రాశి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఈ సీజన్‌లో ఇప్పటికే రెండు దఫాలు కురిసిన అకాల వర్షాలు రబీ రైతులను నిండా ముంచెత్తాయి. కష్టాలు, నష్టాల నుంచి ఇంకా తేరుకోకముందే మరో అల్పపీడనం భయం అన్నదాతలను వెంటాడుతోంది. ప్రకృతి వైపరీత్యాల నుంచి గట్టెక్క మార్గాలు లేక అల్లాడుతుంటే భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం ఆచరణ చర్యలకే పరిమితమవుతోంది. అనుకూల పరిస్థితుల నేపథ్యంలో సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టకపోవడంతో నష్టాలు మరింత పెరుగుతున్నాయి. కొనుగోలులో నిబంధనలు, సంచులు, ట్రాన్స్‌పోర్ట్ కొరత, అన్ లోడింగ్ సమస్యలు, మిల్లర్ల కొర్రీలు వెరసి సమస్యలు తప్పడం లేదు. వాటిని సరిదిద్దాల్సిన ప్రభుత్వ యంత్రాంగం ప్రకటనలు ఇచ్చి చేతులు దులుపుకోవటంతో క్షేత్ర స్థాయిలో రైతుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ ఏడాది కాకినాడ జిల్లాలో 1.63 లక్షల ఎకరాల్లో రబీ వరి సాగు జరగ్గా ఇప్పటికే 50 శాతం కోతలు పూర్తయ్యాయి. గడిచిన నాలుగు రోజులుగా ప్రధానంగా 140 గ్రామాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. 10 వేల ఎకరాల పైబడి కోయకుండా ఉన్న పంట నేలకు ఒరగడంతో నష్టం తీవ్రత ఎక్కువగా ఉంది. పది రోజుల్లో ఈ పంట అంతా చేతికి అంది వచ్చే అవకాశం ఉంది. అయితే అకాలంగా కురిసిన వానలు అన్నదాతలను నిండా ముంచెత్తడంతో లబోదిబోమంటున్నారు. ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.45 వేల పెట్టుబడులు పెట్టిన వీరంతా పూర్తిస్థాయిలో నష్టపోయారు. రెండు రోజుల్లోకే ఒబ్బిడి చేసుకున్న ధాన్యం ఉత్పత్తిని కళ్లారా చూడ్డానుకున్న రైతుల ఆశలు అంతలోనే కరిగిపోయాయి. సుమారు 6 వేల ఎకరాల్లో కోసి పనలపై ఉన్న పంట అంతా తడిచి ముద్ద మొలకలు వచ్చింది. సుమారు 7 వేల ఎకరాల్లో 21 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రాశులుగా ఉండడంతో తడిసి ముద్దయ్యాయి. ఇందులో కొంత ధాన్యాన్ని తక్కువ ధరకే రైతులు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోగా మరికొంత ధాన్యాన్ని ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేసారు. అయితే ఇందులోనూ నూక శాతం సాకు చూపి రైతుల నుంచి సొమ్ములు కట్టించుకోవడం విశేషం.

ఆరబెట్టేందుకు అవకాశం లేక...

వారం రోజులుగా వాతావరణంలో నెలకొన్న మార్పుల కారణంగా అన్నదాతలు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు. పలుచోట్ల నేటికీ ధాన్యం రాశులు ఎక్కడికక్కడే దర్శనమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తడిసి ముద్దయిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు అవకాశం లేకుండా పోతుంది. ప్రతిరోజూ ఏదో ఒక సమయంలో వర్షం పడుతోంది. దాంతో పలుచోట్ల ధాన్యం మొలకలు వచ్చింది. ఆర బెట్టుకుందాం అమ్ముదామంటే తేమ, నూక శాతం పేరుతో మిల్లర్లు బస్తాకు రూ.50 నుంచి రూ.100 వరకు వసూలు చేస్తున్నారని రైతులు తెలిపారు.

ఈ నెల 7న ఏర్పడనున్న అల్పపీడనం తుపానుగా మారి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో అన్నదాతల్లో ఆందోళన మరింత తీవ్రతరం అయ్యింది. శనివారం మధ్యాహ్నం నుంచి జిల్లాలో పలుచోట్ల మళ్లీ వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఆకాశంలో మబ్బులు అలుముకున్నాయి. కొన్నిచోట్ల మళ్లీ వర్షాలు కురిశాయి. రెండు రోజులపాటు ఎండ రావడంతో తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు ఉపక్రమించారు. అయితే పూర్తిస్థాయిలో తేమశాతం తగ్గకుండానే మళ్లీ వానలు పడుతున్నాయి. తడిచిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రభుత్వ యంత్రాంగం మాటలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పలువురు రైతులు వద్దకు ఎవరు కొనుగోళ్ల కోసం వెళ్లడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వర్ష సూచనలతో బెంబేలు



మూడు రోజులు ఆరబెడితేనే కొనుగోలు

ఆరెకరాలు కౌలుకు సాగు చేశాను. వాతావరణం అనుకూలించడంతో యంత్రం ద్వారా కోత కోశాను. అయితే మూడు రోజులు పాటు ధాన్యాన్ని ఆరబెడితే గాని ఆర్బికె ద్వారా తీసుకోమని చెబుతున్నారు. ఇప్పుడేమో వాతావరణంలో మళ్లీ మార్పులు చోటుచేసుకున్నాయి. తడిసిపోతుందనే భయం వెంటాడుతుంది. ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలి.

- నందిపాటి వెంకట రమణ, రైతు, పండూరు, కాకినాడ రూరల్.



కోయడానికి వీల్లేకుండా ఉంది

రెండెకరాలు సొంతంగా, ఆరెకరాలు కౌలుకి సాగు చేశాను. చేను అంతా కోత దశకు వచ్చింది. అకాల వర్షాల వల్ల నీరు నిలిచిపోయి కోత యంత్రం పొలంలోకి దిగడానికి వీల్లేదు. మళ్లీ తుపాను హెచ్చరికలు చెబుతున్న నేపథ్యంలో నా పంట ఏమవుతుందోనన్న ఆందోళనలో ఉన్నాను.

- బి.సత్తిబాబు, రైతు వికె.రాయపురం, సామర్లకోట మండలం.

ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవద్దు

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలోని రైతులు వదంతులను నమ్మకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయించుకోవాలని ఒత్తిడికి గురికాకుండా ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆందోళనకు గురై తమ పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన అవసరం లేదని గ్రామ వ్యవసాయ సహాయకునికి ఒక్క మాట చెబితే చాలు తక్షణం కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తారన్నారు. లేబర్, గన్నీ బ్యాగులు, రవాణా ధాన్యం కొనుగోలులో చాలా ముఖ్యమైనవని చెప్పారు. వీటికి ప్రణాళికాయుత ఏర్పాట్లు క్షేత్రస్థాయిలో ఉన్నట్లు వివరించారు. పంట విస్తీర్ణంతో సంబంధం లేకుండా మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యాన్ని విక్రయించుకునేందుకు ఇ క్రాప్ బుకింగ్ ఉంటే సరిపోతుందన్నారు. మరో రెండు, మూడు రోజుల పాటు వర్షాలు పడే అవకాశమున్నందున ఈ నెల 9న సమగ్రంగా అకాల వర్షాల వల్ల కలిగిన పంట నష్టం వివరాలను సేకరించి అర్హత మేరకు రైతులకు పెట్టుబడి రాయితీ, పంట బీమా పరిహారం అందేలా చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగియక ముందే ప్రభుత్వం పరిహారం అందిస్తున్నందున రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 9వ తేదీ వరకు వర్ష సూచన ఉన్న నేపథ్యంలో రైతులు కోతలు వాయిదా వేసుకోవాలని ఇప్పటికే రాశులపై ఉన్న ధాన్యాన్ని రైతుల కోరిక మేరకు తక్షణం కొనుగోలు చేసేలా అధికారులకు ఆదేశాలిచ్చామని అవసరమైతే ఆఫ్‌లైన్‌లోనూ కొనుగోలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. మిల్లులకు కూడా స్పష్టమైన ఆదేశాలిచ్చామని సత్వరం అన్‌లోడింగ్ జరిగేలా క్షేత్రస్థాయిలోని ప్రత్యేక, కస్టోడియన్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఎలాంటి సహాయం కావాలన్నా ఫిర్యాదులు చేయాలన్నా 8886903611 కంట్రోల్ రూం నెంబరకు ఫోన్ చేయొచ్చన్నారు.



ఆర్‌బికె సిబ్బందితో మాట్లాడుతున్న నాయకులు

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా వెంటనే కొనుగోలు చేయాలని కోరుతూ ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. రెండు రోజుల పాటు మండలంలోని పలు రైతు భరోసా కేంద్రాలను వీరు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పి.మల్లవరం పంచాయతీలో పొలాల మీద ఉన్న ధాన్యం రాశుల వద్దకు వెళ్లి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు ప్రాంతాల్లో రైతుల వద్దకు ఏ ఒక్క అధికారీ రాలేదని రైతులు తెలిపారని వీరన్నారు. ఇప్పటికైనా ఆయా సచివాలయాల పరిధిలో ఉన్న ఆర్‌బికె కేంద్రాల్లో ఉన్న సిబ్బంది రైతులు వద్దకు వెళ్లి వారి వద్ద సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

కలెక్టరేట్‌లోనే నేటి స్పందన

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లా స్థాయి స్పందన ప్రజా విజ్ఞాపనల స్వీకరణ కార్యక్రమం కాకినాడలో కలెక్టరేట్‌లోనే సోమవారం నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9-30 గంటల నుంచి స్పందన జరుగుతుందని అర్జీదారులు, అధికారులు ఈ అంశాన్ని గమనించాలని కలెక్టర్ కోరారు.

కూలీలకు పని కల్పించాలి

ప్రజాశక్తి-తాళ్లరేవు

ఉపాధి కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. నాలుగు రోజులుగా ఉపాధి కూలీల సమస్యలపై ఆదివారం పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. దేశంలో కోట్లాది మంది కూలీలకు ఉపయోగపడుతున్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా విమర్శించారు. ఆయన వెంట మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు దుప్పి అదృష్టదీపుడు ఉన్నారు.

వేసవి క్రీడా శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకుని నైపుణ్యం కలిగిన క్రీడాకారులుగా ఎదగాలని కాకినాడ నగరపాలకసంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా క్రీడా మైదానంలో ఆదివారం నుంచి ప్రారంభమైన వేసవి శిక్షణా శిబిరాన్ని కమిషనర్ ప్రారంభించారు. 14 సంవత్సరాల లోపు బాలబాలికలకు 22 క్రీడాంశాల్లో వేసవి శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 31వ తేదీ వరకు జరిగే వేసవి శిక్షణా శిబిరంలో అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, జిమ్నాస్టిక్స్, ఖోఖో, తైక్వాండో, రైఫిల్ షూటింగ్, స్విమ్మింగ్ వంటి క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ప్రతీ విద్యార్థి క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవి శిబిరం వద్ద క్రీడాకారులకు అవసరమైన మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే సమీపంలోని ఆరోగ్యకేంద్రాలలో వైద్యసేవలు పొందాలని సూచించారు. ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 10 ఏళ్ల లోపు చిన్నారులకు ఏర్పాటు చేసిన 30 మీటర్ల పరుగు పందాన్ని కమిషనర్ ప్రారంభించారు. ఇటీవలే 98 డిఎస్‌సిలో పిఇటిగా ఉద్యోగం పొందిన కోచ్ ప్రసాదరెడ్డిని కమిషనర్ సత్కరించారు. అనంతరం జిమ్నాస్టిక్స్, స్విమ్మింగ్, హాకీ మైదానాలను సందర్శించారు. అక్కడ కల్పించాల్సిన మౌళిక సదుపాయాలను క్రీడలశాఖ అధికారులు కమిషనర్ దష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడామండలి సిఇఒ షేక్ ఇమ్రాన్, చీఫ్‌కోచ్ బి.శ్రీనివాస్‌కుమార్, రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు జార్జి, జిల్లా అధ్యక్షుడు రవిరాజ్, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సాకులు, నిభందనలు పక్కనపెట్టి రైతులను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప డిమాండ్ చేశారు. సామర్లకోట మండలం బోయినపూడి, ఉండూరు గ్రామాల్లో ఇటీవల భారీ వర్షాలకు దెబ్బతిన్న ధాన్యం రాశులను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోలు చెయ్యాలని, నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తొలుత బోయినపూడి, అనంతరం ఉండూరు గ్రామాల్లో పర్యటించి పంట నష్టం ప్రాంతాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి శ్రీనివాసాచార్యులు, కంటే జగదీష్ మోహన్, రాజా సూరిబాబు రాజు, టిడిపి మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనువాసు, కొప్పిరెడ్డి రాజా, అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, తాతపూడి అరుణ్ వంశీ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



రేవు కోసం పోరాడితే కేసులా

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కుంభాభిషేకం రేవు ప్రాంతం కోసం స్థానిక మత్స్యకారులు ఆందోళన చేపడితే కాకినాడ పోర్ట్ ఆఫీసర్ మత్స్యకారులపై అక్రమ కేసు నమోదు చేశారని కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు పేర్కొన్నారు. పూలే పాకల వద్ద పోర్టు భూములను ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి కబ్జా చేసి చదును చేస్తున్నా నేటి వరకూ చర్యలు చేపట్టకపోవడంపై ఆదివారం ఆప్రాంతంలో వనమాడి కొండబాబు పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ తరతరాలుగా కుంభాభిషేకం రేవు వద్ద మత్స్యకారులు క్రయ విక్రయాలు చేసుకుంటూ జీవనోపాధి సాగిస్తున్నారని, ఆ కుంభాభిషేకం రేవు ప్రాంతాన్ని ఎంఎల్ఎ ద్వారంపూడి తన అధికార బలంతో పోర్టుకు కట్టబెట్టి మత్స్యకారులను జీవనోపాధికి గండి కొడుతున్నారని చెప్పారు. తమ రేవు ప్రాంతాన్ని కాపాడుకునే ప్రయత్నంలో మత్స్యకారులు నిరసన చేపడితే, పోర్టు ఆస్తుల ధ్వంసం చేశారని రూ.లక్షా 50 వేలు పోర్టుకు నష్టం వాటిల్లిందని 30 మంది మత్స్యకారులపై అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టులు చేయించి జైలుకు పంపారన్నారు. పూలే పాకల వెనక రూ.45 కోట్లు విలువ చేసే పోర్టుకు చెందిన సుమారు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎంఎల్ఎ ద్వారంపూడి అనుచరులు కబ్జా చేసి చదును చేసి రెండు నెలల కావస్తున్న నేటి వరకు పోర్ట్ అధికారులు ఎటువంటి కేసులూ నమోదు చేయలేదన్నారు.



బుద్ధుని జయంతిలో పాల్గొన్న ప్రతినిధులు

ఘనంగా బుద్ధ జయంతి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

స్థానిక బోట్ క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బుద్ధ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జవహర్ వైశాఖ మాస మొదటి పౌర్ణమిని బుద్ధ జయంతిగా ప్రపంచవ్యాప్తంగా ఒక పండుగ వాతావరణంలో జరుపుకుంటారని అన్నారు. సత్యం, నమ్రత, సదాచారం, సద్విచారం, సద్గుణం, సమద్ధి, ఉన్నతమైన లక్ష్యం, ఉత్తమమైన ధ్యానం ఈ ఎనిమిది సాధనాలను బుద్ధ భగవానుడు మానవుల ఉన్నతి కోసం బోధించాడన్నారు. ధర్మం, అహింస, సామరస్యం, దయాగుణం ఆయన బోధనా సారవన్నారు. ఈ సందర్భంగా బుద్ధ విహార్ కోశాధికారి రాంప్రసాద్ ' బుద్ధుడు -బౌద్ధ ధర్మం' పుస్తకాన్ని డాక్టర్ జవహర్ అడబాలకు అందజేశారు. కాశి రామారావు శ్రీహరి తదితరులు బుద్ధుడు బోధనాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎం.సుబ్బారావు, దాసరి శ్రీధర్, శ్రీరాములు, ఎస్.శ్రీనగేష్, రేలంగి బాపిరాజు, చింతపల్లి సుబ్బారావు, కుమార్, రమణ తదితర వాకర్స్ పాల్గొన్నారు.

నిస్వార్థ నేత దామోదరం సంజీవయ్య

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా నిజాయితీగా పని చేసి మన రాష్ట్రానికి దామోదరం సంజీవయ్య వన్నె తెచ్చారని విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సంజీవయ్య వర్థంతి ఆదివారం ఘనంగా జరిగింది. 38 ఏళ్ల వయసులో రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పరిపాలనలో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారని అన్నారు. వితంతువులు, వద్ధులకు పెన్షన్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు కూడా పెన్షన్ సౌకర్యాన్ని ఆయన కల్పించారన్నారు. అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు, చింతపల్లి సుబ్బారావు, ఎస్.శ్రీ నగేష్ పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు తగవు

ప్రజాశక్తి -కాకినాడ రూరల్

తనపై అసత్య ఆరోపణలు చేయడం తగదనివైసిపి రూరల్ మండలం తూరంగి గ్రామ కమిటీ అధ్యక్షుడు జగడం శ్రీహరి అన్నారు. పార్టీ ఆదేశాల మేరకే కాకినాడ రూరల్‌లో 12 ఏళ్లుగా పార్టీ అభివద్ధికి కృషి చేస్తున్నట్టు శ్రీహరి చెప్పారు. తనపై సోషల్ మీడియా, కొన్ని పత్రికల్లో వైసిపిలో ఉంటూ జనసేన సభ్యత్వం తీసుకున్నట్టు తప్పుడు సమాచారం చేశారని వారిపై తగు చర్యలు తీసుకుంటానన్నారు. ఎంఎల్ఎ కన్నబాబు సహకారంతో ఎఎంసి వైస్ చైర్మన్‌గా తనను నియమించారన్నారు.

వృద్ధులకు పాదరక్షల పంపిణీ

ప్రజాశక్తి కాకినాడ రూరల్

రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో వద్ధులకు ఆదివారం పాదరక్షలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మికవేత్త ఓం నమశ్శివాయ మాట్లాడుతూ సాటి మనిషికి సాయం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో రేలంగి బాపిరాజు, రాఘవరావు, రాజా పాల్గొన్నారు.

విప్లవ వీరుడు అల్లూరికి ఘన నివాళి

మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా పలుచోట్ల ఆదివారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ నాగమల్లి తోట జంక్షన్ వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి ఘన నివాళు లర్పించారు. పంపన దయానంద బాబు, కర్రి అచ్యుతరెడ్డి పాల్గొన్నారు. ఇంద్రపాలెం అల్లూరి సెంటర్ వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి డివైఎఫ్ఐ అధ్యక్షులు చిట్టూరి సాహిత్, రామ్మోహన్ నివాళు లర్పించారు. చిట్టూరి విజయ్ కుమార్, వాసు, గవర బాబ్జీ, చంద్రరావు, శృతి, సరిత, రోహిత్, కీర్తన, కీర్తి, అర్పిత, జగత్, వినీత్, ప్రణీత, మోక్షిత, లంక విజయకృష్ణ పాల్గొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. నగేష్, అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రాజా, ఉంగరాల వెంకటేశ్వరరావు, రేలంగి బాపిరాజు పాల్గొన్నారు. **సామర్లకోట** బళ్ల మార్కెట్ సెంటర్‌లో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. కరణం ప్రసాదరావు మాట్లాడారు. ఎస్.యువరాజు, దారబాని కృష్ణ, చల్లా మహేష్, సింహాచలం,కరణం ఏడుకొండలు, బత్తుల బాలాజీ పాల్గొన్నారు. **ఏలేశ్వరం** సిపిఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు నివాళి అర్పించారు. పిల్ల రాంబాబు, పెద్దపాటి గురయమ్మ, రేఖ అమ్మాజీ, ఉగ్గిన రామం, బత్తుల వీరబాబు, గుండుబిల్లి చక్రం, బర్రె నూకరాజు, రౌతు సత్యనారాయణ ఉన్నారు. **పెద్దాపురం** వరహాలయ్యపేటలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, ముప్పన వీర్రాజు, సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు జోష్యుల కష్ణ బాబు, కూనిరెడ్డి అరుణ, పెద్దింటి సీతన్న, గరగపాటి పెంటయ్య, కేదారి నాగు, సిరపరపు శ్రీనివాస్, క్రాంతి కుమార్, నీలపాల సూరిబాబు పాల్గొన్నారు.



పెద్దాపురంలో అల్లూరికి నివాళి అర్పిస్తున్న నాయకులు

గిట్టుబాటు ధరకు ధాన్యం కొనాలి

కాజులూరు : రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా ధాన్యం కొనుగోలు చేయాలని శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్, టిడిపి రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. ఆదివారం రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలం కుయ్యేరు, దుగ్గుదూరు కోలంకలో తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షం కారణంగా తడిసిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి రైతులు నానా ఇబ్బందులూ పడుతున్నారన్నారు. అటు అయిన కాడికి దోచుకోవడానికి దళారులు చూస్తున్నారన్నారు. తడిసిన ధాన్యం బస్తాను రూ.700కు అడుగుతున్నారని వాపోయారు. కోత కోసిన ధాన్యం వెంటనే అయితే రూ.1,050కు, ఆరబెట్టిన ధాన్యాన్ని రూ.1,320కు అడుగుతున్నారని రైతులు చెబుతున్నారన్నారు.

ఖాళీ స్థలాల్లో 'స్పెషల్ శానిటేషన్ డ్రైవ్'

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు ప్రతిపాదించిన స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌కు ఆదివారం శ్రీకారం చుట్టారు. స్థానిక విద్యానగర్ ప్రాంతంలో నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కాకినాడ రూరల్ ఎంఎల్ఎ, మాజీ మంత్రి కురసాల కన్నబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యానగర్, పరిసర ప్రాంతాల్లో ఎంపిక చేసిన నాలుగు ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్త తొలగింపు ప్రక్రియ చేపట్టారు. ఆల్ ఈజ్ వెల్ వంటి సేవా సంస్థలు, కాలనీ అసోసియేషన్‌లకు చెందిన సుమారు 50 మంది స్థలాలు పరిశుభ్రం కార్యక్రమానికి తోడ్పాటునిచ్చారు. మరో 30 మంది పారిశుధ్య కార్మికులు కూడా వీటిని పరిశుభ్రం చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలగించిన చెత్తను తరలించేందుకు వీలుగా మూడు ట్రాక్టర్లతో పాటు జేసీబి , బ్లేడ్ ట్రాక్టర్లను కూడా సమకూర్చారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు జిలానీ, రాంబాబు, ఆల్ ఈజ్ వెల్ ప్రతినిధి కిషోర్, నెక్కంటి ఆదినారాయణ పాల్గొన్నారు.

ఒత్తిడిని తగ్గించే దివ్య ఔషధం నవ్వు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

తరచుగా నవ్వే వారిలో ఒత్తిడి తగ్గి రోగనిరోధక శక్తి పెరుగుతుందని సినీ నటుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు కాటమరెడ్డి పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ నవ్వుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. నవ్వడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. డాక్టర్ శిరీష, ఉంగరాల వెంకటేశ్వరరావు, రేలంగి బాపిరాజు, చింతపల్లి సుబ్బారావు, రవిశంకర్ పట్నాయక్, ఎస్.శ్రీనగేష్, డాక్టర్ కుమార్ యాదవ్, సత్యనారాయణ, రాజా పాల్గొన్నారు.

కష్టాల్లో ఉన్న కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కార్మికుని కుటుంబానికి ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ఆదివారం సాయం అందించారు. మండలంలోని ఇంజరం పంచాయతీ అరటికాయలంక గ్రామానికి చెందిన సలాది శ్రీనివాస్ భార్య ఇటీవల గుండెపోటుతో మతి చెందారు. ఇద్దరు చిన్నారులతో పెయింటింగ్ వర్క్ చేస్తున్న కార్మికుడు శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల నగదు మరో రూ.5 వేల విలువైన నిత్యావసర సరుకులు, 50 కేజీల బియ్యం అందించారు. ఆయన వెంట ఇంజరం సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్, కోరుకొండ చంటి, బీర సురేష్, చినరాజా, జాన్ ఉన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి-పెద్దాపురం

ప్రతి విద్యార్థి చిన్ననాటి నుంచి క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అన్నారు. చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జూన్ 10వ తేదీ వరకు స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. అనంతరం రొంగల అరుణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు.జెవివి జిల్లా కార్యదర్శి బుద్దా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్ననాటి నుండి సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. ముప్పన వీర్రాజు, డాక్టర్ జోస్యుల కృష్ణ బాబు మాట్లాడారు. ముక్తర్ ఆలీ, పెద్దిరెడ్డి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌తో ఆరోగ్యం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ప్రజలు ఆరోగ్యంగా, దఢంగా ఉండడానికి అథ్లెటిక్స్ ఎంతగానో ఉపయుక్తమని షటిల్ క్రీడాకారుడు ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు, రాజా డాక్టర్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కోడి కత్తుల స్వాధీనం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

మండలంలోని వికె.రాయపురంలో ఆదివారం ఒక వ్యక్తి నుంచి పందేల్లో కోళ్లకు వినియోగించే 42 కోడి కత్తులను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు సామర్లకోట పోలీసులు తెలిపారు. మల్లిరెడ్డి సూరిబాబు దగ్గర నుంచి కోడిపందేలకు ఉపయోగించే సుమారు 42 కోడి కత్తులను సీజ్ చేసి అతని మీద కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

చెరువులో పడి మహిళ మృతి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి మహిళ మతి చెందిన సంఘటన ఇది. ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు కథనం ప్రకారం అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా అరకు మండలం బొండం గ్రామానికి చెందిన బీరవర్త శుక్ర తన భార్య జానకి(48)తో వలస వచ్చి ఎన్.కొత్తపల్లిలో భీమనపల్లి పంచాయతీ భట్టుపాలెంకు చెందిన రైతు చీకట్ల దుర్గాప్రసాద్ రొయ్యల చెరువుల వద్ద మూడేళ్లుగా పని చేస్తున్నాడు. యజమాని దుర్గాప్రసాద్ చెరువుల వద్ద ఆవు కనిపించకపోవడంతో శనివారం రాత్రి సమయంలో జానకి ఆవును వెతుక్కుంటూ వెళ్ళింది. ప్రమాదవశాత్తు పక్క రైతు బొడ్డు వీర వెంకట సత్యనారాయణ రొయ్యల చెరువులో జారిపడి మతి చెందినట్టు భర్త శుక్ర తమకు ఆదివారం ఫిర్యాదు చేశాడన్నారు. జానకికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పేకాట శిబిరాలపై దాడి

ప్రజాశక్తి-జగ్గంపేట

జగ్గంపేట మండల పరిధిలోని పలుచోట్ల పేకాట శిబిరాలపై దాడి చేసి పలువురినీ అదుపులోకి తీసుకున్నట్టు జగ్గంపేట ఎస్ఐ సూర్య అప్పారావు తెలిపారు. కాండ్రేగుల సమీపంలో జేడీ మామిడి తోటలో రహస్యంగా పేకాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని రూ.12,250 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మామిడాడలో మరో పేకాట శిబిరంపై దాడి చేసి పేకాడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నట్టు జగ్గంపేట ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిని సోమవారం కోర్టుకు పంపుతామన్నారు. వీరి వద్ద నుంచి రూ.2,000 నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.



విద్యుదాఘాతంతో మృతి చెందిన పాడిగేదె

విద్యుదాఘాతంతో పాడి గేదె మృత్యువాత

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పాడిగేదె విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడింది. ధవళేశ్వరంలోని స్థానిక సదరన్ డ్రగ్స్ వెనుకన ఉన్న పొలంలో గడ్డి మేసేందుకు వెళ్లిన పాడి గేదె విద్యుదాఘాతానికి గురైంది. చిన్నకర్రలు కట్టి విద్యుత్ వైర్లను లాగారు. వీటికి తగలడంతో గేదె మృత్యువాత పడింది. గతంలో కూడా ఇదే విధంగా ధవలేశ్వరంలోని బ్యారేజీ క్వార్టర్స్‌లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యుదాఘాతానికి గురై పాడిగేదె మృత్యువాత పడింది. ఇప్పుడు మరో గేదె ఇలాగే మృతి చెందడంతో యజమానికి వాపోతున్నాడు. పాడిగేదెలతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నానని, రెండు గేదెలు చనిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని వాపోయాడు.

రౌతులపూడికి పోలీస్ స్టేషన్ మంజూరు

ప్రజాశక్తి- రౌతులపూడి

రౌతులపూడికి త్వరలోనే పోలీస్ సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రత్తిపాడు ఎంఎల్ఎ పర్వత శ్రీ పూర్ణచంద్ర ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రమైన రౌతులపూడిలో పోలీస్ స్టేషన్ కోసం ప్రభుత్వ భవనాలను ఆదివారం ఆయన పరిశీలించారు. మండలానికి పోలీస్ స్టేషన్ మంజూరు చేస్తూ ప్రభుత్వం ఇటీవల జిఒ జారీ చేసినట్టు తెలిపారు. ఆయన వెంట ప్రత్తిపాడు సిఐ కిషోర్ బాబు ఉన్నారు.



ఠాగూర్‌కు నివాళి అర్పిస్తున్న ప్రతినిధులు

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ చిరస్మరణీయుడు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

దేశానికి జనగణమన జాతీయ గీతాన్ని అందించిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ చిరస్మరణీయులని ఆధ్యాత్మికవేత్త రవిశంకర్ పట్నాయక్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఠాగూర్ బాలల హృదయాలను వికసింపజేయడానికి ప్రాచీన మునుల గురుకులాల తరహాలో శాంతి నికేతన్‌గా పేరుగాంచిన విశ్వ భారతి విశ్వవిద్యాలయాన్ని స్థాపించారన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు, ఉంగరాల వెంకటేశ్వరరావు, రాజా, ఎస్. శ్రీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో విద్యార్థులకు ఆటపాటలు

గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రసాద్





ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

వేసవి సెలవుల్లో ఆటలు, పాటలు, విజ్ఞానాన్ని పంచేందుకు ఈ నెల 8వ తేదీ నుంచి గ్రంథాలయాలు సిద్ధమవుతున్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వివిఎల్ఎన్ఎస్‌వి.ప్రసాద్ అన్నారు. గ్రామాలు, పట్టణాల్లోని అన్ని శాఖల్లో ఈ నెల 8 నుంచి కార్యక్రమాన్ని అమలు చేయనున్నామని తెలిపారు. 10 నుంచి 15 ఏళ్ల లోపు బాల బాలికలంతా వీటిని సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లకు సంబంధించిన అంశాలను ఆయన వివరించారు.

శిక్షణా శిబిరాలకు ఏయే ఏర్పాట్లు చేస్తున్నారు..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 102 ప్రభుత్వ గ్రంథాలయాలు ఉన్నాయి. వీటిలో 57 లైబ్రరీలకు సొంత భవనాలుండగా, 14 అద్దె భవనాల్లో, 31 ఉచితంగా ఏర్పాటు చేసిన భవనాల్లో నడుస్తున్నాయి. వేసవి శిక్షణా శిబిరాలను 85 గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్నాం.

గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. సమీపంలోని విద్యార్థులను రప్పించి రోజూ వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తాం. ముఖ్యంగా పిల్లలకు విజ్ఞానం పెంపొందించే కార్యక్రమాలు, మానసిక వికాసానికి ఆటపాటలు నిర్వహిస్తాము. ఒక్కో గ్రంథాలయంలో సగటున 50 మంది వరకు వచ్చి వీటిని వినియోగించుకుంటారు. సోమవారం నుంచి మొదలయ్యే శిక్షణ కోసం అవసరమైన ఏర్పాట్లు చేశాం. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వీటిని నిర్వహిస్తారు.

శిక్షణ తరగదులు ఎలా నిర్వహిస్తారు.?

ఉదయం 8 గంటల నుంచి 8:30 వరకు కథలు వినడం, 8:30 గంటల నుంచి 10 గంటల వరకు పుస్తకాలు చదవడం, తర్వాత పది నిమిషాలు విరామం అనంతరం 10:30 వరకు చదివిన అంశాలపై సమీక్ష ఉంటుంది. 10:30 నుంచి 11 గంటల వరకు కథలు చెప్పడం ఉంటుంది.11 గంటల నుంచి 12 గంటల వరకూ స్పోకెన్ ఇంగ్లీషు, డ్రాయింగ్, డాన్సులు, పేపర్ క్రాఫ్ట్, బొమ్మల తయారీ, నాటికల పోటీలు, ఆటలు, ముఖ్యమైన ప్రతినిధులతో స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు ఉంటాయి.

పిల్లలను ఏ విధంగా ప్రోత్సహిస్తారు..

గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే కరపత్రాలు, గోడప్రతులు ఇచ్చి అందరికీ తెలిసేలా ప్రచారం నిర్వహించాం. వేసవి శిక్షణ, ఆట పాటల్లో పాల్గొనే విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకు సర్టిఫికెట్లతోపాటు, ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేస్తాం. దీని కోసం గ్రేడ్ 1 గ్రంథాలయాలకు రూ.15 వేలు, గ్రేడ్ 2కు రూ.12 వేలు, గ్రేడ్ 3 కు రూ.10 వేలు చొప్పున కేటాయిస్తున్నాం. ఇవి కాకుండా దాతల సహకారం కూడా తీసుకుంటున్నాం.

ఏయే అంశాలపై శిక్షణ ఉంటుంది..

పఠనం, సరదా అనే రెండు విభాగాల్లో శిక్షణ ఉంటుంది. కథలు వినడం, చెప్పడం, గ్రంథాలయాల్లో పుస్తకాలు చదవడం, వాటిపై సమీక్ష, స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం, పెయింటింగ్, పేపర్ ఆర్ట్, సంగీతం, నత్యం, చదరంగం, క్యారమ్స్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తాం. జరిగిన కార్యక్రమాలపై ప్రతి వారం సమీక్ష, చర్చ నిర్వహిస్తారు. మొత్తంగా విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా ఉంటాయి.

యానాం వార్తలు

ప్రభుత్వాసుపత్రిలో పని చేయని ఎక్స్‌రే

ప్రజాశక్తి - యానాం

స్థానిక ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో ఎక్స్ రే యంత్రం పని చేయక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోగులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న యానాం కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ అర్థాని దినేష్ మాట్లాడుతూ గత మూడు నెలలుగా ఎక్స్ రే మిషన్ పని చేయక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు కానీ స్థానిక నాయకులు కానీ స్పందించకపోవడం బాధాకరమన్నారు. దీనిపై ప్రభుత్వ ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ రవిశంకర్‌ను వివరణ కోరగా ఉన్నత అధికారులకు తెలియజేశామని త్వరలో సమస్య పరిష్కారం చూపుతామన్నారన్నారు. ఈ సమస్యను పుదుచ్చేరి ఎంపీ వైద్య లింగంకు ఫోన్లో తెలపగా ఆయన సానుకూలంగా స్పందించి ఎంపీ నిధులు ఏర్పాటు చేస్తామన్నారన్నారు.



అల్లూరికి నివాళులర్పిస్తున్న పరిపాలనాధికారి, సిబ్బంది

అల్లూరి సీతారామరాజుకు పలువురి ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా సమాచార శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్రీ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి ప్రాంతీయ పరిపాలన అధికారి ఆర్.మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ద్విజ్ గోయల్, సిఐ షణ్ముగం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేడిశెట్టి రామలింగేశ్వరరావు, రామరాజు, సుబ్బరాజు, చెల్లి గోపీనాథ్, చెక్కల అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌సిలో శ్రీసిద్ధార్థ ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తమ సంస్థ విద్యార్థులు విశేష ప్రతిభ ఘనపరిచారని శ్రీసిద్ధార్థ విద్యానికేతన్ కరస్పాండెంట్ ఎస్.కె.విశాలాక్షి శేఖర్ రాజు, ప్రిన్సిపల్ కె.చక్రపాణి తెలిపారు. ఆదివారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను అభినందించారు. నూరు శాతం ఫలితాలు సాధించగా విద్యార్థి భరత్ 600/547 మార్కులతో టాపర్‌గా నిలిచాడన్నారు. రాజశ్రీ 520, సౌమ్య 495, 400 దాటి తులసి, లిల్లీ గ్రేస్, జయరాజ్, సాయి చరణ్, దినేష్ కుమార్, శాలిం ప్రదీప్, సాయి మణికంఠ, మేఘన చంద్రకళ, భువనేశ్వరి మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కమల, మంజు, ఉష, జ్యోతి మౌనిక పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ

తాళ్లరేవు మండలం చొల్లంగిపేట డాక్టర్.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు 10లో ఉత్తమ ప్రతిభ సాధించినట్లు ప్రిన్సిపల్ పద్మావతి తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన పి.నిరీష (555 స్కూల్ ప్రథమ) వై.అనూష (530 ద్వితీయ) ఎస్.స్వాతి (528 తృతీయ)లను ఎంఇఒ సంజీవరావు, జిల్లా సమన్వయకర్త ఎ.మురళీకృష్ణ, ఉపాధ్యాయినులు అభినందించారు.



కాకినాడ రూరల్‌లో శ్రీ సిద్ధార్థ విద్యార్థులతో అధ్యాపకులు

పట్టాల పంపిణీపై తప్పుడు ప్రచారం తగదు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కాకినాడ రూరల్ మండలం చిన్నస్వామి నగర్‌లో పేదలకు అందించే ఇళ్ల పట్టాల పంపిణీ వ్యవహారంలో తమపై టిడిపి నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని వైసిపి నాయకులు అన్నారు. ఆదివారం రూరల్ మండలం చిన్నస్వామి నగర్‌లో కరాటి రాము, ఆకుల సత్తిబాబు, ఎఎంసి డైరెక్టర్ కోరాడ అరుణ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2016లో అప్పటి టిడిపి ప్రభుత్వంలో స్వామి నగర్ ప్రాంతంలో 63 మంది పేదలకు, దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని చెప్పారు. దాన్ని 93 పట్టాలు చేశారన్నారు. ఈ విషయంపై రూరల్ తహశీసిల్దార్ స్వామి నగర్ వచ్చి పట్టాల విషయాన్ని తనిఖీ చేయగా సామాజిక స్థలం, వాటర్ ట్యాంక్, పార్కు స్థలములను పరిశీలించారన్నారు. ఆ స్థలాన్ని తాము ఆక్రమించుకొని పట్టాలు సృష్టించామని చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు.

వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల తీవ్రంగా పంట నష్టం వచ్చిన రైతులను, కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలనీ, నీట మునిగిన పంట రైతు భరోసా కేంద్రాల ద్వారా త్వరతగతిని కొనుగోలు చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి డిమాండ్ చేశారు. కరప, వలసపాకల, వేళంగి శివారు కొప్పిశెట్టి వారిపేట, యండమూరు శివారు ఒడ్డుపాలెంలో నీట మునిగిన పంట పొలాలను ఆదివారం స్థానిక నాయకులతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వేసవి కాలం దష్యా వర్షాలు రావని అనేకమంది రైతులు కాస్త అశ్రద్ధ కారణంగా నేడు భారీ స్థాయిలో పంట నష్టం వచ్చిందని, ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు సూచించక పోవటం రైతు భరోసా కేంద్రాలలో సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవటం వల్ల చిన్న సన్నకారు రైతులకు తీవ్ర నష్టం కలిగిందన్నారు. బుంగ సింహాద్రి, గుల్లిపల్లి శ్రీనివాస్, కాకర్ల బుజ్జిబాబు, జమిందార్, గంజా రాంబాబు, మద్దూరి స్వామి పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండలంలోని చంద్రంపాలెం దేవులపల్లి కృష్ణశాస్త్రి మండల పరిషత్ పాఠశాలలో నెల రోజులు నిర్వహించే సమ్మర్ జూడో శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించనున్నట్టు ఉప్పరగూడెం జెడ్‌పి హైస్కూల్ పీడీ కె.వీరబాబు చెప్పారు. విద్యార్థుల్లో శారీరక ధారుడ్యాన్ని, పోటీతత్వాన్ని పెంపొందించే సంకల్పంతో నెల రోజులపాటు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమం ప్రారంభానికి ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య, చంద్రంపాలెం, ఉప్పరిగూడెం ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచి, గ్రామపెద్దలు హాజరవ్వనున్నట్లు చెప్పారు.

మేడే స్ఫూర్తితో హక్కుల పరిరక్షణ

ప్రజాశక్తి-కాకినాడ

మేడే స్ఫూర్తితో హక్కుల పరిరక్షించుకోవాలని పలువురు నాయకులు అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వారోత్సవం లో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో కాకినాడ రాగంపేట వడ్డి పోలమాంబ గుడి సెంటర్ లో శనివారం బహిరంగ సభ నిర్వహించారు. సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎపిఎంఎస్ఆర్‌యు రాష్ట్ర కోశాధికారి దుంపల ప్రసాద్ మాట్లాడుతూ 137వ మే దినోత్సవాన్ని కార్మిక వర్గం జరుపుకుంటోందన్నారు. ప్రత్యేకంగా మనదేశంలో మే దినోత్సవం 1923 ప్రారంభమై నేటికి వందేళ్లు పూర్తయిందన్నారు. కేంద్రం ప్రభుత్వం కార్మిక వర్గానికి నష్టం చేకూర్చే విధంగా నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చిందన్నారు. దీని ద్వారా ఎనిమిది గంటల పని విధానాన్ని మార్పు చేసి 12 గంటలు పని విధానం తీసుకురావాలని చూస్తోందన్నారు. కార్మిక వర్గంతో పాటు ప్రజలపై కూడా నిత్యం విపరీతమైన భారాలు వేస్తూ నిత్యావసర వస్తువుల ధరలను రోజురోజుకు పెంచుకుంటూ పోతోందన్నారు. దీనివల్ల సామాన్య జనం ఆర్థిక ఇబ్బందులు తో కుటుంబాలు సతమతమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర నిర్ణయాలను ఎపి ప్రభుత్వం అమలు చేయడానికి ముందుకు వెళుతోందన్నారు. దీనివల్ల రాష్ట్ర ప్రజలకు కార్మిక వర్గానికి నష్టం కలుగుతున్నా లెక్కచేయకుండా కేంద్ర విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని విమర్శించారు. ఈ మేడే స్ఫూర్తితో కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ అమలు కోసం, కనీస వేతనం రూ.26 వేలు సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. సిఐటియు జిల్లా కోశాధికారి మలక వెంకట రమణ, నగర ఉపాధ్యక్షుడు మేడిశెట్టి వెంకట రమణలు మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో కార్మిక హక్కులు కాపాడుకోవాలని, మరింత ఐక్యంగా కార్మిక వర్గం ఉద్యమాలు నిర్వహించాలన్నారు.

ప్రజానాట్యమండలి కళాకారులు లోవరాజు బందం ప్రదర్శించిన ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి. పెద్దాపురం కళాకారులు రొంగల వీర్రాజు, దారపురెడ్డి కష్ణ, గీతాంజలి బందం దేవి ఆలపించిన గీతాలు అలరించాయి. దారపురెడ్డి సత్యనారాయణ, దూలపల్లి అర్జున్‌ల డప్పుల వాయిద్యం మోత మోగించింది. కార్యక్రమంలో జిజిహెచ్ శానిటేషన్ యూనియన్ అధ్యక్షుడు సిహెచ్.విజయ్ కుమార్, నాయకులు వాసు, మంగతాయారు, తలుపులమ్మ, పుష్ప, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బంగారు సత్తిబాబు, నాయకులు జలగడుగుల శ్రీనివాస్, యరంశెట్టి దొరబాబు, భవిరిశెట్టి గురుమూర్తి, యరంశెట్టి నాగబాబు, ఫ్యాబ్రికేషన్ యూనియన్ నాయకులు బివి.రమణ, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎన్ ఈశ్వరి పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు నాయకులు

జగన్ పాలనలో శెట్టిబలిజలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి- తాళ్లరేవు

సిఎం జగన్ పాలనలో శెట్టిబలిజలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అన్నారు. ఎఎంసి ఛైర్మన్‌గా ఆయన పదవి పొందిన సందర్భంగా యానం శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుంకరపాలెంలోని శంకర్ రెసిడెన్సీలో చీకట్ల సత్యనారాయణ మాస్టారు అధ్యక్షతన జరిగిన శెట్టిబలిజ సంఘ సభ్యులు ఆత్మీయ సమావేశంలో పలువురు శివన్నారాయణను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలోనే తొలిసారిగా రాజ్యసభకు కు పిల్లి సుభాష్ చంద్రబోస్ ను పంపిన ఘనత సిఎం జగన్‌దేనని అన్నారు. అదేవిధంగా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మరో ఇద్దరు ఎంఎల్‌సిలకు అవకాశం కల్పించిన సిఎం జగన్‌కు శెట్టిబలిజలు రుణపడి ఉండాలని తెలిపారు. అదేవిధంగా మల్లాడి కష్ణారావును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పిల్లి త్రిమూర్తులు, చింతాకుల రామకష్ణ, గుత్తుల జయ రామారావు, మట్టపర్తి లోవరాజు, కడలి సుబ్రహ్మణ్యం, చందాల ఏడుకొండలు, కాకి నాగేశ్వరరావు, రామలింగేశ్వర రావు, పంపన చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలు అందించడమే 'చేయూత' లక్ష్యం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఆపన్నులకు సేవలు అందించడమే చేయూత సంస్థ లక్ష్యమని ఆ సంస్థ అధ్యక్షులు ఎం.రవికుమార్ తెలిపారు. ఆదివారం చేయూత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా చేయూత ద్వారా సేవలు అందిస్తున్న పలువురిని కాకినాడలోని ప్రయివేటు ఫంక్షన్ హాల్లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రవి మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద 300 మంది రోగులకు నిత్యం భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. రక్తదాన శిబిరాలు, ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆపన్నులకు అండగా ఉండడం సంతోషకరంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో ఈ సేవలను మరింత విస్తతం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్థిక కార్యదర్శి చింతా నారాయణమూర్తి, సహాయ అధ్యక్షులు భాష, సలహాదారుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో చేయూత సంస్థ అధ్యక్షులు రవి తదితరులు

పోలేరమ్మను దర్శించుకున్న చందన, కందుల

ప్రజాశక్తి-కడియం

మండలంలోని దుళ్ల గ్రామ దేవత పోలేరమ్మ జాతర ముగింపు సందర్భంగా ఆదివారం వైసిపి రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు కందుల దుర్గేష్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ కమిటీ ఘన స్వాగతం పలికింది. అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా నియోజకవర్గ ప్రజలకు ఉండాలని చందన, కందుల ఆకాంక్షించారు. దర్శించుకున్న వారిలో సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, వైసిపి మండల అధ్యక్షులు వై.స్టాలిన్, రాష్ట్ర కార్యదర్శి గిరజాలబాబు, వ్యవసాయ మండలి ఛైర్మన్ ఈలి గోపాలం, ముద్రగడ జమ్మీ, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్, తాతపూడి బాబి తదితరులు ఉన్నారు.

అల్లూరికి ఘన నివాళి

ప్రజాశక్తి - సీతానగరం

అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి సందర్భంగా సీతానగరం నాలుగు బొమ్మలు సెంటర్ ఉన్న విగ్రహం వద్ద సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాజనగరం నియోజవర్గం ప్రెసిడెంట్ సిద్ది నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు నందమూరి చిట్టి స్వామి, వడ్లమూరి సీతారామరాజు, వేటూరి నానాజీ, కోసూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రంగా విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

తాటిపర్తి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వంగవీటి మోహన్ రంగా విగ్రహాన్ని ఆయన తనయుడు వంగవీటి రాధాకృష్ణ ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి రంగా విశేషంగా కషి చేశారన్నారు. రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జి తుమ్మల రామస్వామి, యువత పాల్గొన్నారు.

జేగురుపాడులో బైబిల్ మిషన్ పుట్టింటి సభలు

ప్రజాశక్తి - కడియం

మండలంలోని జేగురుపాడులో రెండు రోజులుగా బైబిల్ మిషన్ పుట్టింటి సభలు జరుగుతున్నాయి. బైబిల్ మిషన్ వ్యవస్థాపకులు ముంగమూరి దేవదాసు అయ్య జన్మించిన జేగురుపాడులో పాస్టర్ సాకా మహిమరాజు ఆధ్వర్యంలో ఈ సభలను నిర్వహిస్తున్నారు. ఈ సభలో ఆదివారం సర్పంచ్ యాదల సతీష్ చంద్రస్టాలిన్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సభ నిర్వాహకులు ఎస్.మహిమరాజు, సభ అధ్యక్షులు ఎస్.ఏసుపాదం, పాస్టర్ ఫెలోషిప్ వారు సంయుక్తంగా సర్పంచ్ స్టాలిన్‌ను సత్కరించి జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో కరుణాకరణ్, పరంజ్యోతి, జయశీలి, మోజెస్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం

ప్రజాశక్తి - ఉంద్రాజవరం

మండలంలోని తాడిపర్రులో శిథిలావస్థకు చేరుకున్న పార్వతీ సమేత సోమేశ్వరస్వామి పురాతన ఆలయం పునర్నిర్మాణానికి గ్రామ పెద్దలు నడుంబిగించారు. మాజీ సర్పంచ్ మట్టా సత్యనారాయణ దీని కోసం రూ.23.50 లక్షలు విరాళం ప్రకటించారని దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.వెంకట్రావు ఆదివారం తెలిపారు. గ్రామంలోని భక్తులు, దాతల సహకారంతో సుమారు రూ.1.50 కోట్లతో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని ఆయన తెలిపారు. మ్యాచింగ్ సొమ్ముతో కలిపి, దేవదాయ ధర్మదాయ శాఖ సుమారు రూ.80 లక్షల నిధులను మంజూరు చేసినట్లు ఇఒ తెలిపారు. ఈ మేరకు మంజూరు పత్రాన్ని కార్యనిర్వహణాధికారి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, పెద్దలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మంత్రి అనుచిత వ్యాఖ్యలకు మద్దిపాటి ఖండన

ప్రజాశక్తి-నల్లజర్ల

వెల్పూరులో రైతు తడిసిన ధాన్యాన్ని కొనేవారు లేరని మంత్రి వద్ద వాపోతుండగా అతనిపట్ల మంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలను టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు ఖండించారు. ఆదివారం తిమ్మన్నపాలెం, చీపురుగూడెం గ్రామంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుకు మంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.34 వేల కోట్ల దళితుల సబ్ ప్లాన్ నిధులను సిఎం జగన్ పక్కదారి పట్టించారన్నారు. నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమిటి? అని ప్రశ్నించారు. ఒక దళితుడిగా తాను దళితుల సంక్షేమానికి వారి అభివృద్ధి కోసం పాటుపడతానన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చెల్లు పెదరామన్న, కూసంపూడి బుజ్జి, వంట్ల పెదరామన్న, మద్దిపాటి సూర్య చంద్రం, జమ్ముల వీరవెంకటసతీష్ తదితరులు పాల్గొన్నారు

అధికార పార్టీని ఇబ్బంది పెట్టేందుకే 'బ్లూ మార్చ్'

ప్రజాశక్తి-రావులపాలెం

దళితుల్ని చైతన్య పరిచేందుకు నిర్వహించ తలపెట్టిన బ్లూ మార్చ్‌ని కొందరు స్వార్థపరులు అధికార పార్టీని ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నం చేశారని వైసిపి నేతలు అన్నారు. వైసిపి జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు కప్పల శ్రీధర్, అడా ఛైర్మన్ గొల్లపల్లి డేవిడ్ తదితరులు ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బ్లూ మార్చ్ ని ఎల్లో మార్చ్ గా మార్చే ప్రయత్నం చేశారని గొల్లపల్లి డేవిడ్ ఆరోపించారు. శాంతియుతంగా జరపవలసిన కార్యక్రమాలలో అల్లరి సృష్టించి దళితులను విభజించాలని కుట్ర జరుగుతుందన్నారు. శ్రీధర్ మాట్లాడుతూ ఏదైనా కార్యక్రమం చేపట్టాలంటే పార్టీలకు అతీతంగా అన్ని పార్టీ లతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని, అలా చేయనప్పటికీ వైసిపి నేతలు మద్దతు తెలిపారన్నారు. చివరకు ఇది టిడిపి కుట్రలో భాగంగా జరుగుతున్నట్లు గ్రహించడం జరిగిందని తెలిపారు.